పేదల ఇంటికే ప్రభుత్వ వైద్యం

- ప్రతి గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు
- పక్కా భవనాల నిర్మాణం
- ఉచితంగా మందుల అందజేత


గోపాలపురం మండలం చిట్యాలలో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం


దేవరపల్లి మండలం బందపురం ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ (ఫైల్)

దేవరపల్లి: గ్రామీణులకు పల్లెల్లోనే వైద్య సేవలు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా ప్రభుత్వం ఇప్పటికే అడుగులు వేసింది. ప్రతి గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయాలని సంకల్పించింది. రెండేళ్లుగా ఈ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. గ్రామ సచివాలయానికి అనుసంధానంగా వాటి నిర్మాణం చేట్టింది. హెల్త్ క్లినిక్కుల్లో రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేస్తున్నారు.

ఇద్దరు డాక్టర్లు, తొమ్మిది మంది సిబ్బంది

ప్రతి హెల్త్ క్లినిక్‌లో విధులు నిర్వహించేందుకు ఇద్దరు డాక్టర్లు, నలుగురు ఆశాలు, నలుగురు సూపర్‌వైజర్లు, ఒక సీహెచ్‌ఓను నియమించారు. వైద్య సిబ్బంది రోజూ తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై సర్వే చేస్తారు. అవసరమైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తున్నారు. రోగి పరిస్థితిని బట్టి పెద్దాసుపత్రికి పంపిస్తారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పర్యవేక్షణలో హెల్త్ క్లినిక్‌లు పని చేస్తాయి. గ్రామీణులకు గతంలో అనారోగ్యం వస్తే వ్యయ ప్రయాసలకోర్చి దూర ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లవలసి వచ్చేది. ఇప్పుడా అవసరం లేదు. ప్రతి రెండు వేల మందికి ఒక హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేశారు.

ఫ్యామిలీ డాక్టర్ సూపర్ హిట్

ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. డాక్టర్, వైద్య సిబ్బంది బృందం ఏర్పడి గ్రామాలకు సందర్శిస్తారు. ముందుగా గుర్తించిన రోగుల ఇళ్లకు డాక్టర్ వెళ్లి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందిస్తున్నారు. ఇంటి వద్దనే అన్ని రకాల వైద్య సేవలు అందుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారంలో ఒక రోజు డాక్టర్ల బృందం ఫ్యామిలీ డాక్టర్ పేరుతో ఇంటింటికీ వెళుతున్నారు.

ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

ప్రతి కుటుంబానికీ గ్రామంలోనే వైద్యం అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసింది. ఇందుకోసం గ్రామాల్లోని ప్రభుత్వాసుపత్రులను అభివృద్ధి చేయడంతో పాటు అవసరమైన డాక్టర్లు, సిబ్బందిని నియమించింది. ఫలితంగా ఇప్పుడు ప్రభుత్వాసుపత్రుల్లో 24 గంటలూ రోగులకు వైద్య సేవలు అందుతున్నాయి. అక్కడితో సంతృప్తి చెందని రాష్ట్ర ప్రభుత్వం మరొక అడుగు ముందుకేసి ప్రతి గ్రామ సచివాలయం వద్ద ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలు నిర్వహిస్తోంది. స్థానిక ప్రభుత్వాసుపత్రుల డాక్టర్లతో పాటు పట్టణాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల నుంచి వైద్య నిపుణులను తీసుకు వచ్చి, రోగులకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయిస్తోంది. అవసరమైన 108 రకాల మందులను అందజేస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి, అవసరమైన రోగులను పట్టణాల్లోని పెద్దాసుపత్రులకు పంపించి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు	: 60
అంచనా వ్యయం	: రూ: 12.40 కోట్లు
డాక్టర్లు	: 120 మంది
సిబ్బంది	: 540 మంది

60 హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు

గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 60 హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. ప్రతి క్లినిక్‌కూ సొంత భవనాల నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం భవనానికి ప్రభుత్వం రూ.20.80 లక్షల చొప్పున మంజూరు చేసింది. మొత్తం రూ. 12.40 కోట్ల వ్యయంతో 60 భవనాలను నిర్మాణం చేశారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలోకి మాజీ ఎంపీపీ కృష్ణవేణి


హోంమంత్రి వనిత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన మాజీ ఎంపీపీ ఖండవల్లి కృష్ణవేణి

నల్లజర్ల: స్థానిక మాజీ ఎంపీపీ ఖండవల్లి కృష్ణవేణి, సూర్యారావు దంపతులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి హోం మంత్రి తానేటి వనిత సమక్షంలో మంగళవారం రాత్రి నల్లజర్లలో వైఎస్సార్ సీపీలో చేరారు. గతంలో పీసీసీ సభ్యురాలిగా పనిచేసిన కృష్ణవేణి గత సార్వత్రిక ఎన్నికల్లో గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. స్థానిక నాయకులు పెండ్యాల వీరరాఘవులు, హరే రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి వెంకటరత్నం, ఎంపీటీసీ పాపా నాగేశ్వరరావు, చిడిపి చింతయ్య కోరికపై ఆమె తన అనుచరులు 100 మందితో పార్టీలో చేరినట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని తన అనుచరవర్గంతో వనితమ్మ విజయానికి కృషి చేస్తానని కృష్ణవేణి తెలిపారు.

వైఎస్సార్ సీపీలో చేరిన లింగంపల్లి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి

నిడదవోలు: బీజేపీ నిడదవోలు నియోజకవర్గ మాజీ కన్వీనర్, ఆ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు లింగంపల్లి వెంకటేశ్వరరావు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. తాడేపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ కండువా కప్పి లింగంపల్లిని ఆహ్వానించారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమం

నిడదవోలు రూరల్: ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడులను గెలిపించాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు కోరారు. మండలంలోని తిమ్మరాజుపాలెం, అట్లపాడు, సమిశ్రగూడెం, డి.ముప్పవరం, పందలపర్రు, విజ్జేశ్వరం గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులు మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశాయి. నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఈ ప్రచారాల్లో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సర్పంచులు పులుమంతుల నాగదేవి, తిక్కా శ్రీను, నాగిరెడ్డి నాగదేవి, సొసైటీ అధ్యక్షులు యాళ్ల రామారావు, గంధం వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నాయకులు వారా ఉమామహేశ్వరరావు, బట్టు సురేష్, కొయ్యే నరేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి మృతి

కొవ్వూరు: పట్టణానికి చెందిన మండా ఆనందబాబు (32) అనే వ్యక్తి మంగళవారం చెట్టుకు ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వేములూరు అవంతీ ఫీడ్స్-1 యూనిట్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు కం రైలు వంతెన దగ్గరలో అతడు అఘాత్యానికి పాల్పడ్డాడు. సంపాదన లేకపోయినప్పటికీ ఎక్కువ ఖర్చు చేస్తున్నావంటూ సోమవారం ఆనందబాబును ఇంట్లో వాళ్లు మందలించారు. దాంతో మనస్థాపం చెందిన అతడు బయటికి వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదని మృతుడి తల్లి మహాలక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై జుబేర్ తెలిపారు. మృతుడికి ఒక సోదరుడు, సోదరి, తల్లి ఉన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ముఖ్యమంత్రికి స్వాగతం


సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

సార్వత్రిక ఎన్నికల ప్రచారం నిమిత్తం మంగళవారం రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సాదర స్వాగతం పలికారు. – నిడదవోలు

10 మద్యం సీసాలతో మహిళ అరెస్ట్

దేవరపల్లి: స్థానికఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని నల్లజర్ల, దేవరపల్లి గ్రామాల్లో మంగళవారం దాడులు నిర్వహించినట్టు సీఐ కె. వెంకటేశ్వరస్వామి తెలిపారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో 20 లీటర్ల సారాతో ఒక వ్యక్తిని అరెస్టు చేశామని చెప్పారు. గోపాలపురంలో 10 మద్యం సీసాలతో మహిళను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై పి. సుధీర్, సిబ్బంది పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక


కొవ్వూరులో టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలు


సత్యకృష్ణను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

కొవ్వూరు: జగనన్న సంక్షేమ పాలనతో అన్ని వర్గాల ప్రజలూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని, సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందని వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు పేర్కొన్నారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం టీడీపీ నుంచి సుమారు 50 మంది కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఈ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ పార్టీ కండువాలు వేసి, వారందరినీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మహ్మద్ బాబ్జీ, షేక్ మున్నా, కామవరం మల్లికార్జున రెడ్డి, సంభాన పవన్ కిషోర్, చీలి ఉదయకుమార్, ఎండీ దుర్గ, కె.విజయలక్ష్మి, ఎస్‌కే విశాలాక్షి, కొల్లాటి సాయి తదితరులు వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట్రావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పట్టాలు లేకుండా ఈ కాలనీలో నివశిస్తున్న 1055 కుటుంబాలకూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇళ్ల పట్టాలు అందించిందన్నారు. మిగిలిన వారికి కూడా రానున్న రోజుల్లో పట్టాలు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా తనను, రాజమహేంద్రవరం ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు, నాయకులు వరిగేటి సుధాకర్ ,కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ నాయకుడి బంధువు..

నిడదవోలు: పేదల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. పట్టణానికి చెందిన రంగా సత్యకృష్ణ మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. కాగా ఆయన పిన తండ్రి రంగా రమేష్ జనసేన పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు. సత్యకృష్ణకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు మంగళవారం పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, కౌన్సిలర్ పువ్వల రతీదేవి, వంగా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రచారానికి జన నీరాజనం

- రెండు గ్రామాల్లో హోం మంత్రి తానేటి వనిత ప్రచారం
- నల్లజర్లలో బైక్ ర్యాలీ
- పూలవర్షం కురిపించిన అభిమానులు


నల్లజర్ల ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, హోం మంత్రి తానేటి వనిత

నల్లజర్ల: మంగళవారం రాత్రి నల్లజర్లలో హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి జనం నీరాజనాలు పలికారు. తొలుత ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు రాగానే సర్పంచ్ పల్లి జ్యోతి, వైస్ ఎంపీపీ ఆరుగొల్లు మణి, మూతిన లక్ష్మి మంగళ హారతులతో వనితకు సాదర స్వాగతం పలికారు. మేణ్ణి యువరాజు బ్రదర్స్ ఆధ్వర్యంలో దాదాపు అరగంట సేపు వివిధ రకాల మెషీన్లతో పూలవర్షం కురిపించారు. వివిధ గ్రామాల నుంచి 300 బైక్‌లతో యువకులు ర్యాలీగా ఆమె వాహనం ముందు సాగారు. మద్దిపాటి ప్రసాద్, ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్, కారుమంచి రమేష్, మేణ్ణి బన్ను, దాపర్తి శివ, వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, మద్దిపాటి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం సాగింది. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో సువర్ణ పాలన సాగుతోందన్నారు. జగనన్న మాటిస్తే ఎన్ని అడ్డంకులు ఎదురైనా నెరవేర్చి తీరతారన్నారు. టీడీపీ నాయకుల మోసపూరిత వాగ్దానాలు నమ్మి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. అమలు సాధ్యం కాని పథకాలతో టీడీపీ మేనిఫెస్టో విడుదల చేసి ప్రజల్ని మభ్యపెట్టేందుకు వస్తోందని, జాగ్రత్తగా ఉండాలన్నారు. ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అచ్చన్నపాలెం ప్రచారంలో ఎంపీటీసీ సభ్యుడు కాకర్ల రాజారావు, గ్రామపెద్ద జాలపర్తి రత్తయ్య, కఠారి రాజ్‌కుమార్, అందుగుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నల్లజర్లలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, నీరుకొండ జయకృష్ణ, కూరపాటి నాగరాజు, మద్దూరి నాగేశ్వరరావు, కంకిపాటి లక్ష్మణరావు, డాక్టరు అల్లూరి సూర్యచంద్రరావు, చెల్లూరి రామశ్రీనివాస్, చకరుటూరి లక్ష్మీగణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


యువకుల బైక్ ర్యాలీ

గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేశారు. వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆ గ్రామంలో గడప గడపకూ వెళ్లి, ప్రజలకు నవరత్నాలు ప్లస్ గురించి, మేనిఫెస్టో గురించి వివరించారు. నమూనా బ్యాలెట్‌పై అవగాహన కల్పించారు. రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ప్రచారంలో కొమ్మిరెడ్డి నారాయణరావు, పెద్దిశెట్టి కిట్టయ్య, కె.అశోక్, ఉప సర్పంచ్ మదన్, పెద్దిశెట్టి గండి, అంజి, ఆకుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వేగేశ్వరపురంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి..


ఖండవల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు
- ఖండవల్లిలో ఎన్నికల ప్రచారం

పెరవలి: ప్రజాసేవ చేయడానికి తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఒక్క పైసా అవినీతి లేకుండా పాలన అందించానని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పెరవలి మండలం ఖండవల్లిలో మంగళవారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలోనే అత్యధికంగా ఖండవల్లి గ్రామాన్ని రూ.100 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. ఇంతటి అభివృద్ధి గత ప్రభుత్వాల్లో ఎప్పుడైనా జరిగిందా అని ప్రశ్నించారు. ఇదే గ్రామంలో 650 మంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందించామని చెప్పారు. సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు మరో అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో శ్రీనివాస్‌నాయుడికి గ్రామ ప్రజలు హారతులు, గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ కార్పెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, ఎంపీటీసీ సభ్యులు బొకే వెంకటేశ్వర్లు, రవి, వైఎస్సార్ సీపీ నాయకులు కందా వెంకన్న, చినబాబు, నాగు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు

గోపాలపురం నియోజకవర్గంలో..

మొత్తం ఓటర్లు	2,42,763
పురుషులు	1,18,965
మహిళలు	1,23,793
పోలింగ్ బూత్‌ల సంఖ్య	248

దేవరపల్లి: సార్వత్రిక ఎన్నికలకు గోపాలపురం నియోజకవర్గంలో ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ నెల 13న పోలింగ్ నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు. పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలను ఇప్పటికే సిద్ధం చేశారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,42,763 మంది కాగా, వారిలో పురుషులు 1,18,965 మంది, మహిళలు 1,23,793 మంది. ఇతరులు ఐదుగురు ఉన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 248 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మండలాలవారీగా గోపాలపురంలో 51 , దేవరపల్లిలో 67, నల్లజర్లలో 66, ద్వారకాతిరుమలలో 64 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. రెండో, తుది విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి కేఎల్ శివజ్యోతి నిర్వహించారు. ఈ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని 248 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు 20 శాతం అదనంగా 297 బ్యాలెట్ యూనిట్లు, 297 కంట్రోల్ యూనిట్లు, 30 శాతం అదనంగా 322 వీవీ ప్యాలెట్లు కేటాయించినట్టు ఆర్‌ఓ శివజ్యోతి వివరించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పోలింగ్ అధికారులు, సిబ్బంది ఒకటికి రెండు సార్లు పునశ్చరణ చేసుకుని ఆచరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె తెలిపారు.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
గోపాలపురం	25089	26054	1	51174
దేవరపల్లి	31662	33154	1	64817
నల్లజర్ల	33610	15159	1	68800
ద్వారకాతిరుమల	28604	29366	2	57962
మొత్తం	118965	123793	5	242763


స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి కేఎల్ శివజ్యోతి

భారీ వర్షంతో సేద తీరిన జనం


తాళ్లపూడి మండలం, అన్నదేవరపేట రోడ్డులో ధాన్యంపై కప్పిన బరకాలు


భారీ వర్షానికి కొవ్వూరులో రోడ్డుపై నిలిచిపోయిన నీరు

కొవ్వూరు: పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంటన్నర పాటు ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో ఎక్కడికక్కడ లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పట్టణంలోని పలు ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. డ్రైన్లు పొంగి ప్రవహించాయి. వర్షానికి తోడు ఈదురుగాలులు వీయడంతో పలుచోట్ల చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్లపై విరిగి పడడంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి నెమ్మదిగా వర్షం ప్రారంభమైంది. వేసవి తాపంతో అల్లాడుతున్న జనానికి ఈ వర్షం ఊరట కలిగించింది.వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో జనం ఉపశమనం పొందారు.

తాళ్లపూడి: అకాల వర్షంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. ఇప్పటివరకూ వేసవితో అల్లాడుతున్న జనం ఉపశమనం పొందారు. ప్రస్తుతం మండలంలో రబీ వరి కోతలు జరుగుతున్నాయి. యంత్రాలతో కోసిన ధాన్యం తడిసి పోతోందని రైతులు వాపోతున్నారు. రోడ్ల పైకి తరలించిన ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్నారు. కొన్ని చోట్ల బస్తాల్లో పట్టిన ధాన్యం సైతం తడిసిపోయిందని వాపోతున్నారు.

చల్లని గాలులు.. చిరుజల్లులు

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలో మంగళవారం సాయంత్రం చిరు జల్లులతో కూడిన చల్లని గాలులు వీచాయి. దీంతో ప్రజలు, పశువులు, పక్షులు తాత్కాలిక ఉపశమనం పొందాయి. సాయంత్రం నాలుగు గంటలకు ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీచాయి. సుమారు రెండు గంటల పాటు చిరు జల్లులు పడ్డాయి. రెండు నెలలుగా వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు చల్లని గాలులకు రోడ్లపైకి వచ్చి సేదతీరారు. చిన్నారులు రోడ్లపై కేరింతలు కొట్టారు. సాగునీరు అందక ఎండిపోతున్న పంటలు జీవం పోసుకున్నాయి.

16 నుంచి దేవరపల్లిలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- 18న శ్రీనివాస కల్యాణం


వేంకటేశ్వరస్వామి వారు

దేవరపల్లి: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలను ఈ నెల 16 నుంచి 20 వరకూ నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఇందుకోసం ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 16 నుంచి ప్రతి రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకూ స్వామి, అమ్మవార్లకు పూజలు, హోమాలు జరుగుతాయన్నారు. 18న సుప్రభాత సేవ పుణ్యాహవచనం, అగ్ని ప్రణయం, కుంభారాధన, నిత్యహోమం, బలిహరణ, తీర్థ ప్రసాద వితరణ, శ్రీవారి రథోత్సవం జరుగుతాయని వివరించారు. సాయంత్రం 5 గంటలకు యాగశాలలో వైదిక కార్యక్రమములు, డోలోత్సవం, ఎదుర్కోలు ఉత్సవం, శ్రీవారి కల్యాణం జరుగుతాయన్నారు. 19న వివిధ పూజలు, హోమాలు నిర్వహిస్తారని శ్రీనివాస్ చెప్పారు. 20వ తేదీ ఉదయం 11 గంటల నుంచి అన్న సమారాధన జరుగుతుందని తెలిపారు.